సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం। 16। అక్టోబర్। 2023



కౌశలం చాటుకుందామా..

విద్యార్థుల్లో సైన్స్ దృక్పథాన్ని పెంచేందుకు.. భావి భారత సైన్స్ పరిశోధకులను తయారు చేసేందుకు కౌశల్ సైన్స్ పరీక్ష-2023కు నోటిఫికేషన్ విడుదలైంది.

8లో



రత్నగిరీశునికి ముత్యాల ఆభరణం

అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారికి, ఆ స్వామి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, శంకరునికి ముత్తంగి సేవ చేసేందుకు సర్వం సిద్ధమైంది.

కడలిలోకి 30 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 30,365 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7,000 క్యూసెక్కుల చొప్పున డెల్టా కాలువలకు 14,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90, భద్రాచలం వద్ద 11 అడుగులకు నీటిమట్టం చేరింది.

ధాన్యం.. రైతుకు ధైర్యం

- ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు
- నెలాఖరు నుంచి కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటికే సిబ్బంది నియామకం
- ప్రారంభమైన శిక్షణ
- పక్కా ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం



గత రబీలో ఉప్పలగుప్తంలో ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా (ఫైల్)

సాక్షి, అమలాపురం: అన్నదాతకు పూర్తి భరోసాను ఇచ్చేలా.. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఖరీఫ్ వరి కోతలు వచ్చే నెలలో ఆరంభమయ్యే అవకాశమున్నందున కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు సన్నాహాలు ప్రారంభించింది. కొనుగోలు కేంద్రాల గుర్తింపు.. వాటిలో సిబ్బంది నియామకం.. కొనుగోలు ప్రక్రియ, విధివిధానాలకు సంబంధించి వారికి శిక్షణ తరగతులు.. ధాన్యం రవాణా వాహనాల ఎంపిక.. వాటికి జీపీఎస్ అనుసంధానం వంటి చర్యలకు జిల్లా పౌర సరఫరాల శాఖ ఇప్పటికే విస్తృతంగా చర్యలు చేపట్టింది.

ఆశాజనకంగా దిగుబడులు

జిల్లావ్యాప్తంగా 1.58 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు జరిగింది. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడం.. గోదావరికి జూలై వరకూ సాధారణ ఇన్‌ఫ్లో పెద్దగా లేకపోవడం వంటి కారణాలతో జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో సాగు ఆలస్యమైంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ లోటు వర్షపాతమే నమోదైంది. ఇన్ని ఒడుదొడుకులు ఎదురైనప్పటికీ జిల్లాలో ఖరీఫ్ దిగుబడులు ఆశాజనకంగా రానున్నాయి. ఎకరాకు 30 నుంచి 32 బస్తాల (బస్తా 75 కేజీలు) చొప్పున జిల్లావ్యాప్తంగా 3.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. తూర్పు డెల్టా పరిధిలోని ఆలమూరు, మధ్య డెల్టా పరిధిలోని కొత్తపేట ప్రాంతాల్లో అక్కడక్కడ ఈ నెలాఖరు నుంచి కోతలు ఆరంభం కానున్నాయి. నవంబర్ రెండో వారం నుంచి ఇవి జోరందుకునే అవకాశముంది.

కొనుగోలుకు సన్నాహాలు

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం:	1,58,000 ఎకరాలు
ధాన్యం దిగుబడి అంచనా:	3,80,000 మెట్రిక్ టన్నులు
జిల్లాలో మొత్తం ఆర్‌బీకేలు	: 384
వీటిల్లో ధాన్యం సేకరించేవి	: 331
కొనుగోళ్లకు నియమించిన సిబ్బంది	: 993
సిద్ధంగా ఉన్న గోనె సంచులు	: 2,20,000

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఇప్పటికే పలు సమీక్షలు నిర్వహించింది. జిల్లా వ్యాప్తంగా 384 రైతుభరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఉన్నాయి. వీటి పరిధిలో అతి తక్కువ విస్తీర్ణం, స్వల్పంగా దిగుబడి వచ్చేవి మినహా మిగిలిన 331 ఆర్‌బీకేల ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ కేంద్రాల్లో పని చేసేందుకు టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్ నియామకాలు ఇప్పటికే జరిగాయి. ఈవిధంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 993 మందిని నియమించారు. వీరికి కొనుగోలు విధానంపై శిక్షణ ఇవ్వనున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని వారికి మండపేటలో ఒక రోజు, మిగిలిన వారికి ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీలో రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు.

ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్

మరోవైపు ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్‌ను అనుసంధానం చేసే ప్రక్రియను కూడా అధికారులు చేపట్టారు. రైతులకు చెందిన వాటితో పాటు లారీ యాజమాన్య సంఘాలకు, మిల్లర్లకు చెందిన వాహనాలు వస్తే వాటికి కూడా జీపీఎస్ అమర్చనున్నారు. అదే సమయంలో లైన్ అధికారులతో ధాన్యం కొనుగోలుపై నిరంతర సమీక్ష జరుపుతున్నారు. గత ఏడాది ఖరీఫ్, ఈ ఏడాది రబీ ధాన్యం కొనుగోళ్లలో ఎదురైన ఆటంకాలను అధిగమించేందుకు పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు. ధాన్యం సేకరణలో కీలకమైన గోనె సంచులను సైతం పెద్ద ఎత్తున అందుబాటులో ఉంచారు. ఇప్పటికే 2.20 లక్షల సంచులను సిద్ధం చేశారు. మొత్తం 95 లక్షల గన్నీబ్యాగ్‌లు అవసరమని భావిస్తున్నారు. అవసరానికి అనుగుణంగా మరిన్ని సంచులు రప్పించనున్నారు.

మద్దతు ధరలపై విస్తృత ప్రచారం

'మార్కెట్‌లో పోటీ పెరగాలి. తద్వారా రైతన్నకు మెరుగైన ధర రావాలి. ఇందుకోసం అవసరమైతే ప్రభుత్వమే ఆర్‌బీకేల ద్వారా పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంది. పోటీని పెంచుతుంది' అని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఇందుకు అనుగుణంగా ప్రతి పంటకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కనీస మద్దతు ధరపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తోంది. సంబంధిత వాల్‌పోస్టర్లను ఆర్‌బీకేలు, వ్యవసాయ శాఖ కార్యాలయాలు, సహకార సంఘాల వద్ద ప్రదర్శిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. మద్దతు ధర విషయంలో ఫిర్యాదుల కోసం ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబరు 1907ను అందుబాటులో ఉంచింది.

జిల్లాలో వివిధ పంటలకు 2023-24లో ప్రకటించిన మద్దతు ధరలు (రూ.లలో)

పంట	మద్దతు ధర
పసుపు	6,850
మిర్చి	7,000
ఉల్లి	770
చిరుధాన్యాలు	2,500
ధాన్యం (కామన్)	2,183
ధాన్యం (గ్రేడ్-ఎ)	2,203
మొక్కజొన్న	2,090
కందులు	7,000
పెసలు	8,558
మినుములు	6,950
కొబ్బరి (మిల్లింగ్)	10,860
కొబ్బరి (బాల్‌కోప్రా)	11,750
అరటి	800

కొనుగోళ్లకు పక్కా చర్యలు



జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు పక్కాగా చర్యలు తీసుకుంటున్నాం. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం సేకరణకు అవసరమైన సిబ్బంది నియామకం జరిగింది. వీరికి శిక్షణ తరగతులు ప్రారంభించాం. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వెళ్లే రవాణా వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి.

– సుధాసాగర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వెంకన్న ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అనపర్తికి చెందిన కె.నాగిరెడ్డి-సత్యసుష్మ రూ.15,600, కాతేరుకు చెందిన డి.అనిల్ రూ.10,116, ఊబలంకకు చెందిన టి.వెంకట నాగిరెడ్డి రూ.10,116, సింగగూడేనికి చెందిన లోకేశ్వరరావు రూ.10,116, ఉప్పల్‌కు చెందిన జి.సత్యనారాయణ, బాలనాగలక్ష్మి రూ.10 వేల చొప్పున ఆదివారం విరాళాలు సమర్పించారు. దాతలకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు చేతుల మీదుగా స్వామివారి చిత్రపటాలు అందజేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఏపీ స్టేట్ ఫెన్సింగ్ అసోసియేషన్, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన కాకినాడ శుభం కాపు కల్యాణ మండపంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి యూత్, సీనియర్స్ ఫెన్సింగ్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 330 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫెన్సింగ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో జిల్లా క్రీడా మైదానం ముఖ్య శిక్షకుడు బి.శ్రీనివాస్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ఫెన్సింగ్‌లో రాణించిన వారికి విద్య, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు సమర్థంగా నిర్వహించిన జిల్లా సంఘాన్ని అభినందించారు. శాప్ పరిశీలకుడిగా గుంటూరు ఫెన్సింగ్ కోచ్ సంగీత బాబు వ్యవహరించారు. అనంతరం విజేతలకు మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫెన్సింగ్ సంఘ కార్యదర్శి కృష్ణమోహన్, జిల్లా అధ్యక్షుడు పవన్, కార్యదర్శి ప్రకాష్, చిత్తూరు చీఫ్ కోచ్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడాకారుల ఎంపికల జాబితాలో అవకతవకలు జరిగాయని, అనర్హులకు చోటు కల్పించారనే ఆరోపణలు రాగా, దీనిపై రాష్ట్ర ఫెన్సింగ్ కార్యదర్శి కృష్ణమోహన్ వివరణ ఇచ్చారు. నిబంధనల ప్రకారమే పోటీలు జరిగాయని, శాప్ పరిశీలకుడు కూడా పోటీలను పర్యవేక్షిస్తున్నారని, అవకతవకలు జరిగే అవకాశం లేదని చెప్పారు.

న్యూస్‌రీల్



ద్రాక్షారామలో బాలాత్రిపురసుందరీ దేవిగా మాణిక్యాంబ అమ్మవారు

అమ్మా భవానీ జగదీశ్వరీ..

- శోభిల్లిన భీమేశ్వరాలయం
- దసరా మహోత్సవాలు ప్రారంభం



అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి వేణు దంపతులు

రామచంద్రపురం రూరల్: అమ్మా భవానీ భగదీశ్వరీ పాహిమాం అంటూ శక్తిరూపిణీగా వివిధ రూపాల్లో కొలువైన ఆ దుర్గమ్మకు భక్తులు జేజేలు పలికారు. త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, 12వ శక్తి పీఠంగా అలరారుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శరన్నవరాత్ర మహోత్సవాలు ఆరంభమయ్యాయి. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వరలక్ష్మి దంపతులు, వేగాయమ్మపేట జమిందారు రాజా వాడ్రేవు సుందర రత్నాకరరావులచే దేవులపల్లి ఫణిరామకృష్ణ బ్రహ్మత్వంలో సంకల్పం, కలశస్థాపన చేసి వేదమంత్రోచ్చరణల నడుమ మాణిక్యాంబ అమ్మవారి దసరా మహోత్సవాలు ప్రారంభించారు. మంత్రి వేణు దంపతుల చేతుల మీదుగా అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం గోపూజ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దాత సత్తి సుబ్బారెడ్డి ప్రసాద వితరణ చేశారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి (తారకేశ్వరరావు), అర్చక స్వాములు, వేద పండితులు పాల్గొన్నారు.

తొలిసారిగా విశేష అలంకరణలు

ఆలయ చరిత్రలో తొలిసారిగా మాణిక్యాంబా అమ్మవారికి విశేష అలంకరణలు ప్రారంభించారు. తొలిరోజు అమ్మవారిని బాలాత్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం మొత్తం సర్వాంగ సుందరంగా పుష్పాలతో తీర్చిదిద్దారు. ఈ వేడుకను తిలకించిన భక్తులు తన్మయత్వం చెందారు.

కిక్కిరిసిన అయినవిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

అయినవిల్లి: లంబోదరుడిని కనులారా చూసిన భక్తజనం తన్మయత్వంలో మునిగితేలింది.. ఆ స్వామి కొలువైన అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ అనంతరం విశేష పూజలు నిర్వహించారు. తర్వాత గరిక పూజ చేశారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 78 మంది భక్త దంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 393 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 14 మంది, అలాగే చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాశన, తులాభారం వంటివి నిర్వహించారు. ఏడుగురు తమ నూతన వాహనాలకు పూజ చేయించుకున్నారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ. 1,75,384 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

లోవలో భవానీ భక్తుల సందడి

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన సాధారణ భక్తులతో పాటు భవానీ దీక్షధారులతో లోవ దేవస్థానం ఆదివారం సందడిగా మారింది. ఆరు వేల మంది భక్తులు క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.66,525, పూజా టికెట్లకు రూ.25,240, కేశఖండన శాలకు రూ.5,440, వాహన పూజలకు రూ.5,500, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.25,552, విరాళాలు రూ.1,18,501 కలిపి మొత్తం రూ.2,46,758 ఆదాయం సమకూరిందని వివరించారు.

శ్రమజీవికి ఉపకారిలా..



రైస్‌మిల్లుల్లో ధాన్యం ఆరబోస్తున్న కార్మికులు

- ఈ-శ్రమ్‌తో ప్రయోజనాలెన్నో
- రిజిస్ట్రేషన్‌కు కసరత్తు ప్రారంభం
- జిల్లాలో 4.26 లక్షల మంది కార్మికులు
- ఇప్పటి వరకూ 2.62 లక్షల మంది నమోదు

మండపేట: శ్రమజీవులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ-శ్రమ్ పోర్టల్ ప్రారంభించింది. ఇందులో కార్మికుల నమోదుకు కసరత్తు ముమ్మరం చేసింది. జిల్లాలో ఇప్పటి వరకు 61.5 శాతం మంది అసంఘటిత రంగ కార్మికులు తమపేర్లు నమోదు చేయించుకోగా నూరు శాతం రిజిస్ట్రేషన్ లక్ష్యంగా చర్యలు చేపట్టింది. పథకం ప్రయోజనాల గురించి కార్మికులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. భవన నిర్మాణ, వ్యవసాయ, రైస్‌మిల్లులు, వ్యాగన్లు, గొడౌన్లు తదితర రంగాల్లో పనిచేసే కార్మికులు ఎంతో మంది ఉన్నారు. కోవిడ్ కష్టకాలంలో పనుల్లేక వీరు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏ రంగంలో ఎంత మంది కార్మికులు ఉన్నారనే విషయమై అప్పట్లో కేంద్రం వద్ద స్పష్టమైన సమాచారం లేక పూర్తిస్థాయిలో ఉపశమన చర్యలు చేపట్టే వీలులేకపోయింది. అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలతో 2021 ఆగస్టులో ప్రభుత్వం ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించి కార్మికుల రిజిస్ట్రేషన్ చేపట్టింది. దీనివల్ల ఏ రంగంలో ఎంత మంది ఉన్నారనే విషయమై స్పష్టమైన సమాచారం ప్రభుత్వానికి అంది వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టే వీలుంటుంది. కార్మిక శాఖ అధికారులు పోర్టల్‌లో కార్మికుల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేస్తున్నారు. జిల్లాలో అసంఘటిత కార్మికులు 4,26,089 మంది ఉన్నారని కార్మిక శాఖ అంచనా. ఇప్పటి వరకూ 2,62,320 మంది కార్మికులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మిగిలిన వారినీ పథకంలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదై 2022 మార్చి 31లోగా ప్రమాదవశాత్తూ మరణం లేదా ప్రమాదవశాత్తూ అంగవైకల్యం పొందిన కార్మికులు ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నారు.

నమోదుకు అర్హులెవరంటే..

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదుకు భవన నిర్మాణ, వ్యవసాయ, వలస కార్మికులు, ఇళ్లల్లో పని చేసేవారు, వీధి వ్యాపారులు, ఆశ వర్కర్లు, మత్స్య కార్మికులు, ప్లాంటేషన్ వర్కర్లు, ఉపాధి హామీ కూలీలు, పాల వ్యాపారులు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేకుండా పనిచేసే కార్మికులంతా అర్హులు. కార్మికుని వయసు 16 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలి.

జిల్లాలో కార్మిక శాఖ కార్యాలయాల పరిధిలో ఇలా..

కార్యాలయం	కార్మికుల అంచనా	రిజిస్ట్రేషన్ పూర్తయిన వారు
అమలాపురం	1,01,000	57,545
మండపేట	94,000	54,503
రామచంద్రపురం	62,088	50,001
కొత్తపేట	80,000	48,675
రాజోలు	90,000	51,596

పథకంలో చేరేందుకు..

రిజిస్ట్రేషన్‌కు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. సీఎస్‌సీ సెంటర్లు, పోస్టాఫీస్‌లు, గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా పేర్లు నమోదు చేస్తారు. సెల్ఫ్ రిజిస్ట్రేషన్ ద్వారా కూడా నమోదు చేసుకొనే సదుపాయం ఉంది. ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్ నంబర్, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన సెల్ నంబర్ ఇవ్వాలి. రిజిస్ట్రేషన్ అయిన వారికి గుర్తింపు కార్డు ఇస్తారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సరిపోతుంది.

ప్రయోజనాలు ఇలా..

- కార్మికుడు ప్రమాదవశాత్తూ అంగవైకల్యం లేదా మరణం సంభవిస్తే ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రూ.లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకూ అతని కుటుంబానికి సాయం అందుతుంది.
- అంతరాష్ట్ర వలస కార్మికులకు జాతీయ ఆహార భద్రత పథకం కింద రేషన్ కార్డ్ జారీ చేస్తారు. దీని ద్వారా ఏ రాష్ట్రంలోనైనా రేషన్ తీసుకోవచ్చు.
- విపత్తుల సమయాల్లో ప్రభుత్వం అందించే సాయం పొందే వీలుంటుంది.

రిజిస్ట్రేషన్ వేగవంతానికి చర్యలు



అసంఘటిత రంగాల్లోని కార్మికులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ శ్రమ్ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. దీనిద్వారా కార్మికులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఏ రంగంలో ఎంతమంది ఉన్నారనే స్పష్టమైన సమాచారం ప్రభుత్వం వద్ద ఉంటుంది. జిల్లాలో కార్మికుల రిజిస్ట్రేషన్ వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నాం.

–టి.నాగలక్ష్మి, జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్, అమలాపురం

కౌశలం చాటుకుందామా..

- ఐక్యూని పెంచేలా క్విజ్ పోటీలు
- ప్రభుత్వ విద్యార్థులకు ప్రత్యేకం
- దరఖాస్తులకు తుది గడువు నవంబర్ 5



రాయవరం: ప్రతిభ చాటేందుకు అందివచ్చిన సమయమిది.. విద్యార్థుల్లో సైన్స్ దృక్పథాన్ని పెంచే సదవకాశమిది.. భావిభారత సైన్స్ పరిశోధకులను తయారు చేసేందుకు కౌశల్ సైన్స్-2023 పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైంది.. విద్యార్థుల్లో ఉన్న విజ్ఞాన కౌశలాలను వెలికితీసేందుకు భారతీయ విజ్ఞాన మండలి (బీవీఎం), ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (ఏపీకాస్ట్) సంయుక్త ఆధ్వర్యంలో ఏటా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో సైన్స్ సబ్జెక్టులపై పరిజ్ఞానాన్ని తెలుసుకోవడంతో పాటు వారిని పరిశోధకులుగా తయారు చేసేందుకు ఉద్దేశించిన ఈ కౌశల్ సైన్స్ క్విజ్‌ను జరుపుతున్నారు. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులు దరఖాస్తులు పంపించేందుకు నవంబర్ 5 చివరి తేదీగా నిర్ధారించారు.

అర్హులు ఎవరంటే..

అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. సదరు విద్యార్థులు ప్రత్యేకంగా క్విజ్ టీమ్‌గా ఏర్పాటు కావాలి. తొలుత అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు సైన్స్ సబ్జెక్టుల టీచర్ల ద్వారా విద్యార్థులను ఎంపిక చేయాలి. తద్వారా ఈ పోటీకి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలి. ఆయా తరగతుల్లోని సైన్స్, గణితం సబ్జెక్టుల్లో విషయాల నుంచి ప్రధానంగా కౌశల్ క్విజ్ పోటీ ఉంటుంది. అదే విధంగా 'విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి' అనే అంశంపై సేకరించిన మెటీరియల్‌ను విద్యార్థులు అధ్యయనం చేయాలి.

ప్రోత్సాహకాలు ఇలా..

జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతికి రూ.7,500, ద్వితీయానికి రూ.6 వేలు, తృతీయ స్థానానికి రూ.4,500 ఇస్తారు. అలాగే ప్రోత్సాహ బహుమతుల కింద రూ.3 వేలు అందజేస్తారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయి పోటీకి పంపిస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతికి రూ.15 వేలు, ద్వితీయానికి రూ.12 వేలు, తృతీయానికి రూ.9 వేలు అందించనున్నారు. రాష్ట్ర స్థాయిలో కన్సోలేషన్ బహుమతులు రూ.6 వేల చొప్పున ఎంపిక చేసిన కొందరికి ప్రదానం చేస్తారు.

పరీక్ష విధి విధానాలివీ..

ఈ పోటీల్లో భాగంగా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సైన్స్ క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలుంటాయి. క్విజ్ టీమ్ కోసం పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తారు. క్విజ్ నిమిత్తం రిజిస్ట్రేషన్ చేసుకున్న స్కూల్స్ ప్రతి తరగతి నుంచి అనగా 8, 9, 10 తరగతుల నుంచి కనీసం ఒకరు, గరిష్టంగా 10 మంది వరకూ ఈ ప్రాథమిక పరీక్ష రాయవచ్చు. ఆన్‌లైన్ పరీక్షను మొబైల్/ట్యాబ్/ల్యాప్‌టాప్/డెస్క్‌టాప్ ద్వారా కాని రాయవచ్చు. తరగతిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థి పాఠశాల క్విజ్ టీమ్ సభ్యుడిగా ఎంపిక చేస్తారు. ఈ మూడు తరగతుల విద్యార్థుల మార్కులు కలిపి పాఠశాల మార్కు నిర్ణయించబడుతుంది. పరీక్ష తరగతుల వారీగా నిర్వహిస్తారు. 8, 9, 10 తరగతుల వారికి వేర్వేరు ప్రశ్నపత్రం ఉంటుంది. 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకూ, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకూ, 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి మూడు గంటల వరకూ ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. ఆయా తరగతులకు గణితం నుంచి 15, సైన్స్ నుంచి 15 మార్కులకు, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ శాస్త్రవేత్తల కృషి అనే అంశం నుంచి 10 మార్కులకు పరీక్ష ఉంటుంది. జిల్లాలో మొదటి 36 స్థానాల్లో ఉన్న పాఠశాలలు జిల్లా స్థాయి ఆఫ్‌లైన్ క్విజ్‌కు అర్హత పొందుతాయి.

పోటీతత్వం పెరుగుతుంది



కౌశల్ సైన్స్ క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనే విధంగా హెచ్‌ఎంలు శ్రద్ధ తీసుకోవాలి. జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు కౌశల్ క్విజ్ పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. అధిక సంఖ్యలో పాఠశాలలు రిజిస్ట్రేషన్ చేయించాలి. విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి కౌశల్ క్విజ్ పోటీలు ఉపకరిస్తాయి.

– ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

నవంబర్ 5 లోపు దరఖాస్తులు

పాఠశాలల కోఆర్డినేటర్లు నవంబర్ 5 లోపు విద్యార్థుల పేర్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీవీఎంఏపీ.ఓఆర్‌జీలో రిజిస్ట్రేషన్ చేయాలి. విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి జనరల్ థీమ్‌తో పోస్టర్ కాంపిటేషన్‌ను ఇందులో భాగంగా నిర్వహించనున్నారు.

ప్రాథమిక, జిల్లా, రాష్ట్ర స్థాయి పరీక్షలిలా..

కౌశల్ సైన్స్ క్విజ్ ప్రాథమిక స్థాయి ఆన్‌లైన్ పరీక్షను నవంబర్ 21, 22, 23 తేదీల్లో నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో డిసెంబర్ 8వ తేదీన, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 29, 30 తేదీల్లో జరుపనున్నారు. రాష్ట్ర స్థాయి విజేతలకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి మరిన్ని వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ బీఎస్ఎన్ మూర్తిని 94409 93742 నంబరులో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



సీబీఎస్ఈ సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

రాజానగరం: దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సీబీఎస్ఈ సౌత్‌జోన్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈ పోటీలకు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 32 సీబీఎస్ఈ స్కూళ్ల నుంచి 532 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సోమవారం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ జరగనున్నాయి. రెండో రోజు సాయంత్రానికి సెమీ ఫైనల్స్‌కు ఎనిమిది జట్లు చేరుకోగా వాటిలో ఏడు జట్లు తమిళనాడుకు చెందినవే కావడం విశేషం. మహర్షి విద్యా మందిర్ (తమిళనాడు), సీఎస్ అకాడమీ (తమిళనాడు), ఎస్‌బీఓఏ స్కూల్ (తమిళనాడు), వెల్లమ్మాళ్ విద్యాశ్రమం (తమిళనాడు), అగరం పబ్లిక్ స్కూల్ (తమిళనాడు), పీఎస్ఎస్ఆర్ సెకండరీ స్కూల్ (తమిళనాడు), జవహర్ హైయర్ స్కూల్ (తమిళనాడు), సెయింట్ ఆంథ్రుస్ (హైదరాబాద్) జట్లు సెమీస్‌కి అర్హత సాధించాయి. కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, కడప జిల్లాలకు చెందిన జాతీయ స్థాయి రిఫరీల పర్యవేక్షణలో ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నారు.

టేబుల్ టెన్నిస్‌లో పతకాలు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): అనంతపురంలో ఈ నెల 13 నుంచి 16 తేదీ వరకూ జరుగుతున్న ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా టేబుల్ టెన్నిస్‌కు చెందిన పలువురు క్రీడాకారులు పతకాలు సాధించారు. పురుషుల విభాగంలో టి.ప్రభాత్‌సాయి, ఏడీ మణికంఠ, మంజు అవినాష్, బి.తనుష్, చరణ్ కార్తీక్, మహిళల విభాగంలో వై.వైష్ణవి సూర్య, ఛార్వి ఫల్గున్, జి.సిరిపావని, పి.శ్రీలక్ష్మి, జి.తాన్యశ్రీలు కాంస్య పతకాలు సాధించారు. అండర్‌- 17 బాలుర విభాగంలో బి.సాయి జోషిత్, ఎస్.లోహిత్ సూర్య, ఎస్.మోహిత్ శ్రీకపిష్, కె.గౌతంలు కాంస్య పతకాలు సాధించారని కోచ్ వీటీవీ సుబ్బారావు తెలిపారు. విజేతలను జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విశ్వనాథం భాస్కరరామ్, అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ అభినందించారు.

యోగా థెరపీలో రామారెడ్డికి పీహెచ్‌డీ



సమావేశంలో యోగా థెరపీ పీహెచ్‌డీ చూపుతున్న డాక్టర్ కర్రి రామారెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, నిత్య విద్యార్థి డాక్టర్ కర్రి రామారెడ్డి తన ఖాతాలో మరో పీహెచ్‌డీ వేసుకున్నారు. ఆయన తాజాగా యోగా థెరపీలో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ సాధించారు. విభిన్న రంగాలలో ఎన్నో డిగ్రీలు సాధించిన వ్యక్తిగా ప్రపంచ రికార్డుల్లో కర్రి రామారెడ్డి నమోదయ్యారు. ఆదివారం స్థానిక మానస ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల కోర్సయిన యోగా థెరపీలో పార్ట్ టైమ్ పీహెచ్‌డీ పుదుచ్చేరిలోని శ్రీబాలాజీ విద్యాపీఠ్‌లో చేశానన్నారు. ఇక్కడ యోగా థెరపీలో పీహెచ్‌డీలో ఏడేళ్ల కిందట చేరిన కొంతమంది అభ్యర్థులున్నప్పటికీ వారు ఇంకా కోర్సు పూర్తి చేయకపోవడంతో ఈ యూనివర్సిటీ నుంచి యోగా థెరపీలో తొలిసారిగా పీహెచ్‌డీ సాధించిన ఏకైక వ్యక్తిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. కరోనా సమయంలో 4,400 మంది మానసిక రోగులను చూడటంతో తన పరిశోధన ద్వారా 667 మంది స్కిజోఫ్రీనియా అనే మానసిక వ్యాధిగ్రస్తులకు మందులతో పాటు విభిన్నమైన యోగా ప్రక్రియలతో వారికి కలుగుతున్న మేలుని అధ్యయనం చేశానన్నారు. ఇదే యూనివర్సిటీలో మరో సబ్జెక్టులో పీహెచ్‌డీ చేయనున్నానన్నారు. డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ వివిధ అంశాలలో డిగ్రీలు, పీహెచ్‌డీలు చేస్తూ అందరికీ మార్గదర్శకంగా ఉంటున్న డాక్టర్ రామారెడ్డికి పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి పురస్కారాలు అందించాలన్నారు. పతంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో యోగా సర్టిఫికెట్ కోర్సు చేసిన డాక్టర్ రామారెడ్డి ఇప్పుడు యోగా థెరపీలో పీహెచ్‌డీ చేయడం ఆనందంగా ఉందన్నారు. శివశంకర్, పీవీఎస్ కృష్ణారావు పాల్గొన్నారు.

రత్నగిరీశునికి ముత్యాల ఆభరణం

- నేడు 'ముత్తంగి' సేవ
- ప్రారంభించనున్న స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి



ముత్తంగి వస్త్రాలను దేవస్థానం ఏసీ రమేష్‌బాబు, అర్చకులకు అందజేస్తున్న వ్రతపురోహిత సంఘం


అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో కొలువైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల ×ముత్తంగి× సేవకు సర్వం సిద్ధమైంది. పట్టువస్త్రాలు, బంగారు, వజ్రాభరణాలతో ప్రతి నిత్యం భక్తులకు దర్శనమిచ్చే స్వామి, అమ్మవారు, శంకరులు సోమవారం నఖశిఖ పర్యంతం మంచి ముత్యాలతో తయారైన ముత్తంగి వస్త్రాలను దర్శించి భక్తులకు కనువిందు చేయనున్నారు. సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకు శారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతీ స్వామీజీ ముత్తంగి వస్త్రాలు ధరించిన సత్యదేవుడు, అమ్మవారు, శంకరులను దర్శించి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం భక్తులను స్వామి, అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. రూ.8.50 లక్షలతో ఈ ముత్తంగిలను తయారు చేయించిన దేవస్థానం వ్రతపురోహిత సంఘం నాయకులు ఆ సంఘ మాజీ అధ్యక్షుడు నాగాభట్ల రవిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ముత్తంగిలను దేవస్థానానికి లాంఛనంగా అందజేశారు. వీటిని వ్రత పురోహితుల నుంచి స్వీకరించిన దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు స్వామివారి ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, ఉప ప్రధానార్చకుడు ఇంద్రగంటి వెంకటేశ్వర్లుకు ఇచ్చారు. దేవస్థానం వైదిక కార్యక్రమాల సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, వ్రత పురోహిత సంఘం ప్రముఖులు కర్రి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శక్తిరూపిణి.. సర్వపాపహారిణి

- విజయదుర్గా పీఠంలో శరన్నవరాత్ర ఉత్సవాలు
- రజత కవచ అలంకారంలో అమ్మవారు



పీఠంలో భక్తులు ఏర్పాటు చేసుకున్న కలశాలు



రజత కవచ అలంకరణలో విజయదుర్గా అమ్మవారు

రాయవరం: అంబరాన్నంటే దసరా సంబరాలు ఆరంభమయ్యాయి.. ఆ దుర్గామాతను అత్యంత భక్తితో స్మరించే శరన్నవరాత్ర ఉత్సవాలు రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30 గంటలకు చిత్త నక్షత్రం బుధహోరలో పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) సమక్షంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, సూర్యరాజ్యలక్ష్మి, పీఠం భక్తజన సంఘం సభ్యుడు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరీ దంపతులు కలశస్థాపన చేసి పూజలు చేశారు. విజయదుర్గాదేవి ఉత్సవమూర్తి సహిత పంచాయతన దేవతలు, శ్రీదేవి, భూదేవి సమేత విజయవేంకటేశ్వరస్వామి విగ్రహాల మధ్య వేలాది మంది భక్తులు కలశాలను ఏర్పాటు చేసుకున్నారు. తొలిరోజు 950 మంది కలశాలు పెట్టారు. ఈ సందర్భంగా పీఠంలో విఘ్నేశ్వర పూజ, నవగ్రహార్చన, గోపూజ, శ్రీచక్ర అర్చనలతో పాటు సప్తశతి పారాయణ, రుద్రాభిషేకం, గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ, నక్షత్ర హోమాలతో పాటు దేవీయాగం నిర్వహించారు. పీఠంలో ఉన్న విజయదుర్గా అమ్మవారిని రజత కవచ అలంకారంలో పలు రకాల పువ్వులు, సర్వాభరణాలతో నయనానందకరంగా అలంకరించారు. పీఠానికి హాజరైన భక్తులనుద్దేశించి పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి మాజీ రీజినల్ కోఆర్డినేటర్ కందర్ప హనుమాన్, సాహితీవేత్త గొర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజాధికాలు నిర్వహించారు. పీఠం పీఆర్వో వి.వేణుగోపాల్ (బాబి)ల ఆధ్వర్యంలో పీఠానికి వచ్చిన భక్తులకు అన్నసమారాధన జరిగింది.

వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- వచ్చే నెల 2 నుంచి ఉత్సవాలు
- ఘనంగా యాగశాల రాట ముహూర్తం



బ్రహ్మోత్సవాల యాగశాల రాట ముహూర్తం చేస్తున్న కమిటీ సభ్యులు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 2 నుంచి 11 వరకూ జరగనున్నాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా యాగశాల రాట ముహూర్తం కార్యక్రమం ఆదివారం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అర్చకులు యాగశాల రాట కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఉత్సవాల్లో భాగంగా నవమూర్తి ఆవాహన, ధ్వజారోహణ, శ్రీనివాస కల్యాణం, మహా సుదర్శన హోమం, అష్టాదళ పాదపద్మారాధన, అష్టోత్తర శత కలశాభిషేకం, నవగ్రహ హోమం, సంతాన గోపాల మూల మంత్ర పూర్వక హోమం, మహిళలచే సామూహిక కుంకుమార్చన, మహాలక్ష్మి హోమం, మహా పుష్పయాగం, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ పూజల నేపథ్యంలో ఆలయంలో జరిగే అష్టోత్తర పూజలు, కల్యాణాలు, ఉపనయనాలు, వివాహాలు రద్దు చేశారు. బ్రహ్మోత్సవ ఆర్జిత సేవలకు రూ.1,116 చెల్లించే భక్తులు నగదు, డీడీలు, మనియార్డర్లు ఈఓ, శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానం, వాడపల్లి, ఆత్రేయపురం మండలం, ఫోన్: 08855-271888కు పంపించి రశీదు పొందాలన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా 'జీఎస్ఎల్' జట్టు



చాంపియన్‌షిప్ ట్రోఫీని సొంతం చేసుకున్న జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ జట్టు

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల ప్రాంగణం వైద్య విద్యార్థినుల ఆటల పోటీలతో మూడు రోజులుగా హోరెత్తింది. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని మెడికల్, డెంటల్ కళాశాలల విద్యార్థినుల 23వ ఆటల పోటీల్లో సుమారు 450 మంది మెడికోలు సత్తా చాటే ప్రయత్నం చేశారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, షెటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలలో గెలుపే లక్ష్యంగా హోరాహోరీగా తలపడ్డారు. ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ జట్టు కైవసం చేసుకుంది. అలాగే బ్యాడ్మింటన్, త్రోబాల్, టేబుల్ టెన్నిస్, చెస్‌లలో కూడా జీఎస్ఎల్ మెడికోలే విజేతలుగా నిలిచారు. విజేతలకు జీఎస్ఎల్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సి.హనుమంతరావు బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే..

వాలీబాల్‌లో ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ (గుంటూరు) విన్నర్‌గా, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ రన్నర్‌గా నిలిచింది. బాస్కెట్‌బాల్‌లో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ (రాజమండ్రి), సిద్దార్థ మెడికల్ కాలేజీ (విజయవాడ) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. టెన్నిస్‌లో ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ (విశాఖపట్నం) మొదటి స్థానంలో నిలవగా ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ (గుంటూరు) తరువాత స్థానం దక్కించుకుంది. బాల్ బ్యాడ్మింటన్‌లో అనిల్ నీరుకొండ డెంటల్ కాలేజీ (విశాఖపట్నం) విన్నర్‌గా, సిద్దార్థ మెడికల్ కాలేజీ (విజయవాడ) రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ (రాజమండ్రి) విజేతగా, జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ (రాజమండ్రి) ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. చెస్‌లో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, సిద్దార్థ మెడికల్ కాలేజీ (విజయవాడ), త్రోబాల్‌లో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, కోనసీమ డెంటల్ కాలేజీ (అమలాపురం), టేబుల్ టెన్నిస్‌లో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ (గుంటూరు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

డిప్లొమా ఇంజినీర్ల కొత్త కార్యవర్గం ఎన్నిక

అమలాపురం రూరల్: పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్ల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నూతన కార్యవర్గ ఎన్నిక అమలాపురం కాటన్ గెస్ట్ హౌస్‌లో ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. దీనికి పరిశీలకులుగా రాష్ట్ర డిప్లొమా ఇంజినీర్ల అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్యం రాంబాబు, బి.కొండలరావు వ్యవహరించారు. కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా గాడి వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా జి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా రాజుబాబు, ప్రధాన కార్యదర్శిగా అబ్బాయి దొరలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే 50 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్యం రాంబాబు మాట్లాడుతూ సభ్యుల హక్కులు పరిరక్షణకు అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 300 అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులను భర్తీ చేసి, ఏఈలపై అదనపు భారాన్ని తగ్గించాలని కోరారు. కమిటీ సభ్యులకు పీఆర్ డీఈఈ రాజకుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

శాసనసభలో దేవాంగుల గళం వినిపిద్దాం

- రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్రబాబు
- దేవాంగ జనగణన యాప్‌ను ప్రారంభించిన చందన



యాప్‌ని ప్రారంభిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలో బలమైన బీసీ సామాజిక వర్గంగా ఉన్న దేవాంగులు ముందుకు వచ్చి రానున్న ఎన్నికల్లో సత్తా చాటి శాసనసభలో దేవాంగుల గళం వినిపించాలని రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్రబాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జాంపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం వార్షికోత్సవం సర్వజన మహాసభ, దేవాంగుల జనగణన మొబైల్ యాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సురేంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేవాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నా రాజకీయంగా వెనుకంజలో ఉన్నారన్నారు. సభకు ఆంధ్రప్రదేశ్ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డీకే నాగరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ దేవాంగులందరినీ ఐక్యం చేసేందుకు దేవాంగ జనగణన మొబైల్ యాప్ ప్రారంభించామన్నారు. దీనివల్ల దేవాంగులు ఏ ప్రాంతంలో ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు. 'దేవాంగ జనగణన మొబైల్ యాప్'ను రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు దేవాంగ ప్రముఖులకు శాలువాలు వేసి, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. సభలో తిరుపతి దేవాంగ సత్రం అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాద్, తెలంగాణ రాష్ట్ర దేవాంగ సంఘ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, బీరక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానమే పెనుభూతమై...

గోపాలపురం: అనుమానమే పెనుభూతమైంది.. పచ్చని కాపురంలో చిచ్చు రేపింది.. భార్యభర్తల మధ్య మనస్పర్థలను చివరికి తారాస్థాయికి చేర్చింది.. అనుమానంతో భార్యను కత్తితో పొడిచి అతనూ పొడుచుకున్న సంఘటన ఆదివారం గోపాలపురం మండలం చిట్యాలలో జరిగింది. దేవరపల్లి సీఐ ఎ.శ్రీనివాసరావు కథనం ప్రకారం.. చిట్యాల గ్రామానికి చెందిన వయ్యేటి చంద్రమోహన్ (30)కు, చేబ్రోలు గ్రామానికి చెందిన మేరీ(28)తో ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్లు కాపురం సజావుగానే సాగింది. కొంత కాలంగా భార్యపై భర్త అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం చంద్రమోహన్, మేరీల మధ్య వివాదం ముదిరింది. చివరికి భార్యను కత్తితో కడుపులో పొడిచి చంద్రమోహన్ కూడా పొడుచుకున్నాడు. దీంతో ఇద్దరికీ తీవ్ర రక్తస్రావం కావడంతో గోపాలపురం సీహెచ్‌సీకి బంధువులు తీసుకెళ్లారు. వీరికి ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు. ఇరువురికీ ప్రాణాపాయం తప్పినట్లు వైద్యులు చెప్పారు.